క్లుప్తంగా

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం



మాట్లాడుతున్న ఆత్మకూరు ఏపీడీ అన్వరాబేగం

జూపాడుబంగ్లా: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఏపీడీ అన్వరాబేగం తెలిపారు. సోమవారం ఆమె స్థానిక ఉపాధిహామీ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని ఏడు మండలాల్లో 25వేల ఉపాధిశ్రామికులకు పనులు కల్పించాలని టార్గెట్ ఉన్నట్లు తెలిపారు. 40,234 మంది ఉపాధిశ్రామికులు పనులకోసం డిమాండ్ ఇవ్వగా వారిలో 29,881 మంది ఉపాధిశ్రామికులు మాత్రమే పనులకు హాజరవుతున్నట్లు తెలిపారు. టార్గెట్ కంటే అధికంగానే పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఏపీఓ రేష్మ ఉన్నారు.

వైభవంగా ఈశ్వరస్వామి రథోత్సవం



ఈశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలోని ఈశ్వస్వామి తిరునాలలో భాగంగా మూడోరోజు సోమవారం పార్వతీ సమేత ఈశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రి ఉత్సవ మూర్తులు శివపార్వతుల విగ్రహాలను రథంలో కొలువుంచి విశేష పూజల అనంతరం ముందుకు కదిలించారు. ఆలయ ఆవరణ నుంచి భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, డప్పునాధాల మధ్య పురవీధుల వెంట రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఈశ్వరుడు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో ఈశ్వరుడికి సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణం నుంచే గాక చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు చేపట్టారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరి దేవి వార్షికోత్సవం



పూజలందుకున్న అమ్మవారు

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలో అంకాల పరమేశ్వరి దేవి వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఆర్.రఘుకుమార్‌శర్మ, శంకరయ్య.. అంకాల పరమేశ్వరిదేవికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకార పూజ, మహా మంగళ హారతి, చండీ హోమం, శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి పల్లకీ సేవ సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజలు చేసి, స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

వైభవంగా సుదర్శన హోమం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో శ్రీగణ మద్దిలేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత వేద పండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణహుతి గావించి మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు అమ్మవార్లకు సాముహిక ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ



స్వామిఅమ్మవార్ల పల్లకీని శ్రీశైల గిరిప్రదక్షిణకు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు



ఆలయ పురవీధుల్లో శ్రీశైల గిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం శ్రీశైల గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలువీరభద్రస్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్ధరామప్పకొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రమణీయం.. లక్ష్మీచెన్నకేశవ రథోత్సవం



మిడుతూరులో లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవానికి హాజరైన జనం

మిడుతూరు మండల కేంద్రంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం సోమవారం కడు రమణీయంగా జరిగింది. ఆలయ అర్చకులు లక్ష్మీ చెన్నకేశస్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా రథాంగ పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని భక్తులు ముందుకు లాగారు. మంగళవాయిద్యాలు, డప్పు నాదాల మధ్య పురవీధుల వెంట రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్ఐ ఓబులేసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- నందికొట్కూరు

మల్లన్నకు సహస్రదీపార్చన



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సోమవార సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథం పై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు



స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. సోమవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయల సేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

వైభవంగా మల్లమ్మ జయంత్యుత్సవం



మల్లమ్మ జయంత్యుత్సవంలో పాల్గొన్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామివారి పరమ భక్తులలో ఒకరైన హేమారెడ్డి మల్లమ్మ జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గోశాల సమీపంలోని మల్లమ్మ కన్నీరు మందిరం వద్ద సంప్రదాయబద్ధంగా జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లమ్మకు పంచామృత అభిషేకం, జలాభిషేకం తదితర విశేష పూజలు జరిపించారు. ముందుగా జయంత్యుత్సవ సంకల్పం పఠించారు. మహాగణపతిపూజ జరిపిన అనంతరం స్తోత్ర పారాయణలతో మల్లమ్మ వారికి అభిషేకం, అర్చన జరిపించారు. అలాగే మల్లమ్మను స్తుతిస్తూ పలు భక్తి గీతాలను ఆలాపించారు. పూజా కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



సీడీపీఓకు సమ్మె నోటీసును అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

నందికొట్కూరు: అంగన్‌వాడీ వర్కర్స్ సమస్యలపై ఈనెల 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మదర్‌బీ కోరారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ కోటేశ్వరమ్మకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు అనుకూలంగా ఉంటూ కార్మిక వర్గంపై బానిసత్వాన్ని రుద్దటం దారుణమన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం తగదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీదేవి, లత, సువర్ణమ్మ, లలితమ్మ, గాయత్రి, కాత్యాయని, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు తాకి గొర్రెలు మృతి



విద్యుత్ తీగ తగిలి మృతి చెందిన గొర్రె

పాములపాడు: ఇస్కాల గ్రామంలో తెగిన పడిన విద్యుత్ తీగ తగిలి రెండు గొర్రెలు మృతి చెందగా ఒక వ్యక్తి త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక భవనాశి నది ఒడ్డున ఉన్న శ్రీనందీశ్వరాలయం సమీపంలో రైతు ప్రసాద్ పొలంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. బోయ వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన గొర్రెలు సోమవారం పొలంలో మేస్తూ అటు వైపు వెళ్లడం రెండు గొర్రెలు విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. అప్పటికే అదే గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తి పొరపాటున విద్యుత్ తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్కనే ఉన్న రైతులు గమనించి వెంటనే కర్రలతో కొట్టి ప్రాణాపాయం నుంచి తప్పించారు.

ఆలయ ధర్మకర్తలమండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: మండలంలో ఆలయాల ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓలు నరసయ్య, రామాంజనేయ శర్మ సోమవారం తెలిపారు. కోటపాడు వీరభద్ర, చెన్న కేశవస్వామి, శిరివెళ్ల ఓంకారేశ్వర, బోయలకుంట్ల, గుండంపాడు, సర్వనరసింహ స్వామి ఆలయాల్లో ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25లోగా పూర్తి చేసిన దరఖాస్తులను నంద్యాల రైతు నగరంలోని దేవదాయ శాఖ జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం



కల్యాణం అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సామూహిక వ్రతాలు, కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి వధూవరులను పెళ్లి పీటలపై ఆశీనులు గావించి శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం భక్తజనం మధ్య స్వామి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి, సురేష్, ప్రసన్నయ్య, స్నేహలత, లీలా, లలిత, రాజేశ్వరి, శిరీష, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

సంచార చికిత్స తనిఖీ

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామంలో సోమవారం ఏఎన్ఎంల ఆధ్వర్యంలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించాలని ఆయన ఏఎన్ఎంలకు సూచించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

నందికొట్కూరు: ఈనెల 15లోపు మద్యం దుకాణాలకు గీత కులాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన ఎస్ఐలు జబ్రుల్లా, శ్రీనివాసులుతో కలిసి మాట్లాడారు. అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. లైసెన్స్ ఫీజు 2024–25 సంవత్సరానికి రూ.11,45,834, 2025–26 సంవత్సరానికి రూ.30,25,000 చెల్లించాలన్నారు. కులధ్రువీకరణ పత్రం పొందడంలో, దరఖాస్తు చేయడంలో ఏదైనా సమస్య వచ్చినా 94409 02576 నంబరును సంప్రందించాలన్నారు. ఎవరి ప్రలోభాలకు, బెదిరింపులకు భయపడకుండా నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి కౌలు రైతుల సదస్సులు

ఆత్మకూరు: మండలంలో మంగళవారం నుంచి 19వ తేదీ వరకు కౌలు రైతుల సదస్సులు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. కౌలు రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా ర్యాలీ

బండి ఆత్మకూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి ఎం.స్వాతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పచ్చి రొట్ట, జీవామృతం తదితర సహజసిద్ధమైన ఎరువులను వాడటం వల్ల భూమి ఆరోగ్యం మెరుగు పడి, పొలాలు తెగుళ్లకు గురి కాకుండా ఉంటాయని ఆమె రైతులకు సూచించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల నేల సారం తగ్గడంతోపాటు దిగుబడులు విషతుల్యమవుతాయన్నారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తుల పరిశీలన

వెలుగోడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ఏఓ పవన్ కుమార్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందేందుకు కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి కౌలు గుర్తింపు కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఈఓఆర్డీ మురారి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ నాగజ్యోతి, ఐసీడీఎస్ సీడీపీఓ కోమల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జనార్దన్, శ్రీనివాసులు, శివమ్మ, రామయ్య, తులసమ్మ పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల పెంపకంతో ఆదాయం

మహానంది: పుట్ట గొడుగుల పెంపకం ద్వారా ఆర్థిక ఆదాయం లభిస్తుందని మహానంది వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాలలో ఎస్సీ సబ్ ప్లాన్ పథకంలో భాగంగా ఎస్సీ విద్యార్థులకు సోమవారం పుట్ట గొడుగుల పెంపకం ఆర్థిక సాధికారత అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్ట గొడుగుల పెంచడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ పథకంలో భాగంగా విద్యార్థులకు బ్యాగులు, కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వే కోసం రెండు అర్జీలు

పాములపాడు: పొలాలు సర్వే చేయాలంటూ 2 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలంలోని జూటూరు, ఇస్కాల గ్రామాలకు చెందిన ఇద్దరు రైతుల నుంచి అర్జీలు వచ్చాయన్నారు. వెంటనే వీటిని పరిశీలించి మండల సర్వేయర్‌కు ఫార్వర్డ్ చేసి ఆ భూములను కొలతలు వేయిస్తామని వివరించారు.

ఖాళీ బిందెలతో నిరసన



నీటి బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

తాగు నీటి కోసం కొత్తపల్లి మండలం సింగరాజు పల్లి గ్రామం ఎస్సీ కాలనీ వాసులు సోమవారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. నాలుగు రోజులుగా కుళాయిలకు నీరు సరఫరా కాకపోయి నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండడం.. సర్పంచ్‌కు సమస్యను విన్నవించినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఎంపీడీఓకు దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోన్ చేసినా ఆయన మళ్లీ మాట్లాడతానంటూ పెట్టేస్తున్నారని, ఇంకెవరికి చెప్పుకోవాలో తెలియక నిరసనకు దిగామన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీ వాసులకు సీపీఎం మండల కార్యదర్శి స్వాములు మద్దతు పలికారు. – కొత్తపల్లి

• మల్లన్నకు నృత్యార్చన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై నల్గొండకు చెందిన నాట్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ భరత నాట్యం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకకౌత్వం, భోశంభో శివశంభో, నమశ్శివాయతే, నమో భవాయ, శివపంచాక్షరీ స్తోత్రం, శంకరశ్రీగిరి తదితర గీతాలకు కల్యాణిశేఖర్, సహస్ర, అద్వైత, వర్షిక తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

హోరాహోరీగా ఒంటెద్దు బండి పోటీలు

• విజేతగా నిలిచిన పెద్దకందుకూరు వృషభం



రాతిదూలం లాగుతున్న ఎద్దు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ఒంటెద్దుబండి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ ప్రసాదరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి ప్రారంభించారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 12 వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. నిర్ణీత 10 నిమిషాల సమయంలో ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరుకు చెందిన పెద్ద గురువయ్య వృషభం ప్రథమ స్థానంలో నిలిచి రూ. 15 వేలు కై వసం చేసుకుంది. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన పోషన నరసింహారెడ్డి ఎద్దు రెండవ స్థానంలో రూ. 10 వేలు దక్కించుకుంది. ఇదే జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తుంగా నారాయణస్వామి వృషభం తర్వాతి రెండుస్థానాల్లో నిలిచి రూ.8 వేలు, రూ.6వేలు బహుమతులు గెలుపొందాయి. నాసారి సిద్దయ్య, సొదరదిన్నె సర్పంచ్ ఆసం మధుసూదన్‌రెడ్డి, పాండురంగస్వామి ఉత్సవ కమిటీ ఆర్థిక సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకులు కరిమద్దెల మురళీకృష్ణ, పెనుగొండ రాజశేఖర్, గడ్డం నాగేశ్వరరెడ్డి, సహదేవరెడ్డి, లక్ష్మినాగేంద్రబాబు పాల్గొన్నారు.

నల్లవాగుపల్లెలో మారెమ్మ తల్లి జాతర



పూజలందుకున్న అమ్మవారు



కోలాటం ఆడుతున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని నల్లవాగుపల్లెలో మారెమ్మ జాతర సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో మొదటి రోజున మారెమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి పోతును గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం కోలాటం, రాత్రి చెక్కభజన తదితర కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పణ, 14వ తేదీన న్యూ కేటగిరి వృషభ రాజములకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ఎల్లావత్తులలో..

మండల పరిధిలోని ఎల్లావత్తులలో గ్రామ పెద్దలంతా కలిసి గంగ జాతర చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

జూపాడుబంగ్లా: పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఘన నివాళులర్పించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మురళీనాయక్ లాంటి ఎంతో మంది వీరసైనికులు నిత్యం కంటిమీద కునుకులేకుండా దేశం కోసం గస్తీ కాస్తుండటం వల్లే మనం సుభిక్షంగా, సంతోషంగా జీవించగలుగుతున్నామన్నారు. సైనికుల త్యాగాలు ఎప్పటికీ మరవరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, సీఐ సుబ్రమ్మణ్యం, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఏఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.